
కథ



# అంతర్నేత్రం

యస్వీ కృష్ణ
93999 39302

"కాఫీ.. కాఫీ.. కాఫీ.."

ఆలోచనల్లోంచి తేరుకుంటూ తల తిప్పాను!

డిపార్చర్ టైమ్ దగ్గరపడేకొద్దీ కంపార్టుమెంట్లోకి ఎక్కుతున్న ప్రయాణికులు క్రమంగా పెరుగుతున్నారు. అప్పటికే ఎక్కేసినవారు పక్కవారితో కబుర్లు చెబుతున్నారు. కొందరు కాఫీ తాగుతూ నాలాగే ఆలోచనల్లో మునిగి ఉన్నారు. మొత్తానికి ఎవరి లోకంలో వారున్నారు. మళ్లీ ఇటువైపు తిరిగి కిటికీలోంచి బయటికి చూడసాగాను.

నేను గుంటూరుకి ప్రయాణమవడం ఇది అయిదోసారో, ఆరోసారో! మొదటిసారి చిన్నప్పుడెప్పుడో వెళ్లాను. కానీ, గత ఐదేళ్లుగా గుంటూరు టౌన్ గుర్తురాగానే.. వెంటనే నా మదిలో మెదిలే వ్యక్తి.. నా ప్రాణస్నేహితురాలు.. మంజుల! ఇప్పుడు కూడా నేను హైదరాబాద్ నుంచి బయల్దేరింది.. తన పెళ్లికి అటెండ్ అవడానికే!

"నేనెందుకే మంజూ! పెళ్లిలో నన్ను నీ ఫ్రెండ్‌గా చూశారంటే.. నీ అత్తింటివారికి నీపట్ల ఇంప్రెషన్ పోతుందే! నా మనసు నీకు తెలుసుగా.. నేను రాకున్నా నా విషెస్ ఎప్పుడూ నీకుంటాయనీ!" అని నచ్చజెప్పాలని చూసినా..

తను వినిపించుకోలేదు.

"నోర్మూయ్యవే! నువ్వు గనుక నా పెళ్లికి రాలేదంటే.. ఏం చేస్తానో తెలుసా?"

"ఊఁ.. ఏం చేస్తావ్?" నేను కుతూహలంగా చూస్తూ అడిగేసరికి చెప్పింది..

"ఇంకెప్పుడూ నీతో మాట్లాడను!"

నేను తేలిగ్గా నవ్వేశాను.

"పోవే.. నువ్వూ, నీ ప్రతిజ్ఞలూ! నీ గురించి నాకు తెలీదా మంజూ! నాతో మాట్లాడకుండా రెండ్రోజులు కూడా నువ్వుండలేవు! ఏదైనా జరిగే విషయం చెప్పమ్మా!" అన్నాను.

"అయితే విను!" అని ఉక్రోషంగా..

"నువ్వు నా పెళ్లికి రాకుంటే.."

నేను ఆసక్తిగా చూడటం గమనించి చెప్పేసింది..

"నేనూ నీ పెళ్లికి రాను!"

అంతే.. ఫకాల్మని నవ్వేశాను. ఈసారి తను నివ్వెరపోతూ చూసింది నావంక.

"ఏమైందే.. ఇప్పుడు నేనేం అన్నాననీ? ఉన్నట్టుండి ఎందుకలా నవ్వుతున్నావ్?"

నేను నవ్వాపుకోడానికి ప్రయత్నిస్తూ..

"మరి.. ఇలాంటి జోకులేస్తే నవ్వరేంటీ?" అంటూ పడీ పడీ నవ్వుతున్న నేను.. మనసులో ఎక్కడో కలుక్కుమనేసరికి గుండెలోని దిగులుపొర కళ్లలో తేమతెరగా మారుతూండగా నోరు విప్పాను..

"మంజూ.. నిజంగా నాకు పెళ్లవుతుందంటావా?"

* * *

'యువర్ అటెన్షన్ ప్లీజ్.. తెనాలి వెళ్లు నాగార్జున ఎక్స్‌ప్రెస్ బయలుదేరుటకు సిద్ధముగా ఉన్నది!'

అనౌన్సర్ మాటలు వినగానే ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికుల్లో ఉన్నట్టుండి కలకలం మొదలైంది. కిటికీ పక్కనే కూర్చున్న నేను అప్రయత్నంగా టైమ్ చూసుకున్నాను. ఐదు నిమిషాలుంది.. రైలు బయల్దేరడానికి!

ఓ ముగ్గురు వ్యక్తులు లగేజీతో గబగబా నేను కూర్చున్న